క్లుప్తంగా

వైభవంగా అంకాలమ్మ జాతర



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఖాజీపేట : మండలంలోని తుడుమలదిన్నె, అగ్రహారం గ్రామంలో అంకాలమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. రెండు గ్రామాల్లో నూతనంగా అంకాలమ్మ ఆలయాలను నిర్మించారు. ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట పూర్తి చేసి 41 రోజులు అయ్యింది. ఈసందర్భంగా గ్రామాల్లో గ్రామస్థులు అందరూ కలసి జాతర నిర్వహించారు. అమ్మవారికి మహిళలు బోనాలు అర్పించి ప్రత్యేక పూజలు చేశారు. జాతర ఉత్సవంతో పెద్ద ఎత్తున స్థానిక మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

భగవద్గీత పఠించాలి



భగవద్గీత పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక వెంకటేశ్వర్లపేటలోని జగద్గురు వేదాంతం లక్ష్మణార్యులు స్వరాజ్యం ఆశ్రమంలో భగవద్గీత 12వ అధ్యాయంలోని భక్తి యోగంలోని శ్లోకాలపై నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులను మూడు విభాగాలు విభజించి శ్లోక పఠన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాధు గోపాలకృష్ణ, జింకా సుబ్రహ్మణ్యం, రాధ, మధుసూదన్‌రెడ్డి, రత్నమ్మ, కృష్ణ చైతన్య స్వామి, మచ్చా ప్రభాకర్, శీపాల శివ, శివారెడ్డయ్య, రమణారెడ్డి, జింకా చెంద్రాయుడు, వద్ది ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నదిలో జలం.. తీర్చేను దాహం



భానుడి ప్రతాపానికి ప్రజలే కాదు.. జంతువులు కూడా అల్లాడిపోతున్నాయి. వేసవి ఎండల నుంచి కుందూ నదికి ఇపుడు కాస్త ఊరట లభించింది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరడంతో రబీలో కొర్ర, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలకు, పశువులు, మేకలు, గొర్రెల తాగునీటి అవసరాలను నది తీరుస్తోంది. కొందరు యువకులు జలకాలాడుతూ సేద తీరడం కనిపిస్తోంది.

– రాజుపాళెం



చంద్రగ్రహణాన్ని వదిలించి వెలుగులు నింపుతాం

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఏడాది కాలంగా రాష్ట్ర ప్రజలకు పట్టిన చంద్ర గ్రహణాన్ని వదిలించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకే ఈ నెల 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. దొరసానిపల్లెలోని తన స్వగృహంలో నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో రాచమల్లు మాట్లాడుతూ గత ఏడాది జూన్ 4న ఎన్నికల ఫలితాల్లో తాము ఓటమి చెందామన్నారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. అన్నదాత సుఖీభవ, ఆడ బిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం లాంటి గొప్ప పేర్లు పెట్టారేగానీ, ఏవీ అమలు చేయలేదన్నారు. చేనేతలకు, దళితులకు ఉచిత కరెంట్ ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదని తెలిపారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజలకు డబ్బు ఇస్తే అది గొప్పపని కాదని విమర్శించిన కూటమి నేతలు ఇప్పుడు ఎందుకు అమలు చేయలేకపోతున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే ప్రజల్లో అసంతృప్తి మొదలైందని, చంద్రబాబును నమ్మి తాము ఓడిపోయామని ప్రజలే బాహాటంగా చెబుతున్నారన్నారు. ఇప్పటివరకూ ప్రభుత్వం లక్షా 70వేల కోట్ల రూపాయలు అప్పు చేసినా, చిల్లిగవ్వ ప్రజలకు ఇవ్వలేదని ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని మాని వైఎస్సార్‌సీపీ నేతలపై కూటమి నాయకులు కక్షసాధింపు చర్యలను మొదలు పెట్టారన్నారు. 2029 ఎన్నికల్లో తప్పక జగన్ ముఖ్యమంత్రి అవుతాడన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌తోపాటు కూటమికి చెందిన వార్డు స్థాయి నేతలు వాడవాడలా ప్రచారం చేశారని తెలిపారు. ప్రభుత్వం మెడలు వంచి సంక్షేమ పథకాలు అమలయ్యేలా ఒత్తిడి తెస్తామన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎంపీపీ శేఖర్‌యాదవ్, రాజుపాళెం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్ఏ నారాయణరెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి, వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగేంద్రారెడ్డి, రాజుపాళెం మండల కన్వీనర్ బాణా కొండారెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పస్నీటి కాశయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.రాయపురెడ్డి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షురాలు మద్దూరి దేవి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జ కళావతి తదితరులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదాం

- ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపు
- ఈ నెల 4న వెన్నుపోటు దినం



వెన్నుపోటు దినం పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదామని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ఒక్క పథకం కూడా అమలు చేయకుండా విద్యార్థులను, యువతను, మహిళలను, రైతులను మోసం చేసిందన్నారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్రంలో శాంతిభద్రతలను గాలికొదిలేసి కేవలం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కక్ష సాధింపులే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రశ్నించే గొంతుకలపై తప్పుడు కేసులు బనాయిస్తూ అరాచక పాలన సాగిస్తున్నారని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేసి ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తే.. నేటి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వ బాధ్యతారాహిత్యాన్ని నిరసిస్తూ చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ నెల 4న స్థానిక సిద్దవటం రోడ్డులోని ఎన్‌జీవో కాలనీ వద్ద గల వైఎస్ విగ్రహం నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి అనంతరం వినతిపత్రం సమర్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, బూత్‌కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, రామసుబ్బారెడ్డి, రాజీవ్‌బాష, వెంకటేశ్వర్లు, రాళ్ళపల్లి నరసింహులు, హరికృష్ణారెడ్డి, రమేష్‌బాబు, పోలిరెడ్డి, దావీదు, మల్లేశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఓ.ప్రభాకర్‌రెడ్డి, పుత్తా శ్రీరాములు, చెన్నకృష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, మాధవరెడ్డి, వెంకటేశ్వర్లు, మౌలాలి, పుల్లయ్య, మల్లేష్, సాయినారాయణరెడ్డి పాల్గొన్నారు.

యువత సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : యువత విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విశ్రాంత పంచాయతీ రాజ్ ఎస్ఈ సానా వెంకట రవీంద్రవర్మ పేర్కొన్నారు. స్థానిక చాడేశ్వరిదేవి తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలిచి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతిభ గల తొగటవీర క్షత్రియ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 13 ఏళ్లుగా ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నట్లు తెలిపారు. కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య మాట్లాడుతూ తొగటవీర క్షత్రియ వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తే తన వంతు సహకారంగా రూ.10లక్షలు అందిస్తామని తెలిపారు. అనంతరం పది, ఇంటర్, బీటెక్, బీఫార్మసీ, ట్రిపుల్ ఐటీ, మెడికల్, జేఈఈ మెయిన్స్‌లో రాణించిన 115 మంది విద్యార్థులకు రూ.3.25 లక్షల నగదు ప్రోత్సాహక బహుమతులు, మెడల్స్, ప్రశంసాపత్రాలను అందించారు. సంఘం నాయకుడు పల్లా శేషయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత పదవులు అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు పట్టుపోగుల నాగేశ్వరరావు, ఉమ్మడి శెట్టిచౌడయ్య, పల్లా శంకర్ నారాయణ, గంజికుంట ఆంజనేయులు, సానా వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిల వసూళ్లకు ప్రత్యేక బృందాలు

మైదుకూరు : మైదుకూరు విద్యుత్ సబ్ డివిజన్‌లో విద్యుత్ బకాయిల వసూళ్లకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజన్‌లోని మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట, వనిపెంట సెక్షన్లలో విద్యుత్ బిల్లుల బకాయిలు అధిక మొత్తంలో పేరుపోయాయని ఆయన పేర్కొన్నారు. అన్ని కేటగిరిలతోపాటు వ్యవసాయ కేటగిరిలో అధిక మొత్తంలో బకాయిలు ఉన్నాయని.. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో బకాయిల వసూళ్లకు ఈనెల 3వ తేదీ మంగళవారం నుంచి ప్రత్యేక బృందాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఈ బృందాలు వారంలో నాలుగు రోజులపాటు ఉదయం నుండి సాయంకాలం వరకు పాత బకాయిలను వసూలు చేస్తారని తెలిపారు. ఐదు సెక్షన్లలోని విద్యుత్ వినియోగదారులు ముఖ్యంగా రైతులు విద్యుత్ బకాయిలను ప్రత్యేక బృందాలు సభ్యులకు చెల్లించాలని కోరారు.

సీఎస్ఐ గోల్డెన్ జూబ్లీ టౌన్ చర్చి నూతన కమిటీ



ఎన్నికైన కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు : స్థానిక సీఎస్ఐ గోల్డెన్ జూబ్లీ టౌన్ చర్చిలో డివిజనల్ చైర్మన్ రెవరెండ్ సి.సాల్‌మోన్ అధ్యక్షతన ఆదివారం పాలక మండలి ఎన్నిక జరిగింది. పాలకమండలి సెక్రటరీగా ఆర్.ప్రభుకుమార్, ట్రెజరర్‌గా జీజే క్రిష్టఫర్, కమిటీ సభ్యులుగా పీపీ జయకుమార్, ఏసీఎస్ దేవకృప, కె.దేవసహాయం, వైఎస్.ఇంజలిన్, వై.ప్రభుకుమార, కె.జోయల్, నితిన్‌రాజ్, రాణెమ్మ, వైఎస్ శ్రావణబిందులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన పాలకమండలికి 2025 నుండి 2028 మూడేళ్ల కాలపరిమితి ఉంటుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలక మండలి చర్చి అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు.

శంకరయ్య సేవలు ప్రశంసనీయం



శంకరయ్య దంపతులను సన్మానిస్తున్న సన్నిహితులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ శంకరయ్య సేవలు ప్రశంసనీయమని ప్రొద్దుటూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సురేంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ఐఎంఎల్ డిపోలో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శంకరయ్య శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా సిబ్బంది, బంధువులు, సన్నిహితులు ఆదివారం ఎఫ్‌జీ ఫంక్షన్ హాల్‌లో శంకరయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖలో శంకరయ్య మంచి సేవలు అందించాడని వక్తలు తెలిపారు. అలాగే యూనియన్ లీడర్‌గా సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ వెంకటసుబ్బయ్య, ఎస్ఐ అల్లాబకాష్, పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ



లక్ష్మీనారాయణమ్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

బి.కోడూరు : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వెంకటసుబ్బారెడ్డి సతీమణి లక్ష్మీనారాయణమ్మను బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల లక్ష్మీనారాయణమ్మ అనారోగ్యానికి గురయి ఆసుపత్రిలో చికిత్స తీసుకుని స్వగ్రామానికి వచ్చారు. విషయం తెలిసుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ బి.కోడూరు గ్రామానికి వెళ్లి లక్ష్మీనారాయణమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సూచించిన జాగ్రతలు పాటించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామక్రిష్ణారెడ్డి, సింగిల్‌విండో చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మూల ఈశ్వర్‌రెడ్డి ,సర్పంచ్ మునిరెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయినారాయణరెడ్డి పాల్గొన్నారు.

యోగా జీవన విధానంలో భాగం కావాలి



యోగా సాధన చేస్తున్న మున్సిపల్ కార్యాలయ సిబ్బంది

బద్వేలు అర్బన్ : మానవుని జీవన విధానంలో యోగా ఒక భాగం కావాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న యోగాంధ్ర 2025 ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక పోరుమామిళ్ల రోడ్డులో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మానవుల జీవన విధానం గందరగోళంగా తయారైందని, ఇలాంటి పరిస్థితుల నుంచి బయటపడటానికి యోగా మంచి ఔషధమన్నారు. నిత్యజీవితంలో యోగాసనాలను అలవాటు చేసుకోవడం ద్వారా చక్కని క్రమశిక్షణ, ఏకాగ్రత అలవడుతుందని అన్నారు. అనంతరం యోగా గురువులు అమర్‌నాథరెడ్డి, నందగోపాల్ నేతృత్వంలో యోగా సాధన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఎదుర్కోలు ఉత్సవం



స్వామి, అమ్మవార్లను ఎదుర్కోలు కార్యక్రమానికి తీసుకువస్తున్న కమిటీ సభ్యులు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్య మఠం, కొండావదూత ఆశ్రమంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం జరగనున్న కల్యాణం సందర్భంగా ఆదివారం రాత్రి ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల ఎదుర్కోలు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు పెళ్ళి పెద్దలుగా ఉండి ఎదురుకోలు తంతును శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం ఆలయంలో చతుస్థానార్చన, మూలమూర్తిహోమం, ఉత్సవబలి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే స్వామివారికి పవిత్రజలాలతో గంగానయనం కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులకు సహకరించిన దాతలను సన్మానించారు. అలాగే ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కల్యాణం

వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించి సాయంత్రం హనుమంత వాహనసేవ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.

చదువుతోపాటు ఆటలూ ముఖ్యం

అట్లూరు : విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు ముఖ్యమేనని అట్లూరు గ్రంథాలయాధికారి సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటలూ నేర్చుకోవడం వలన మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఈనెల 6వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నారు.

ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి గన్‌మెన్‌ల కేటాయింపు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ జీవీ.ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ప్రభుత్వం వన్ ప్లస్ వన్ గన్‌మెన్‌లతో భద్రత కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఎస్పీ ఆదివారం గన్‌మెన్‌లను కేటాయించారు. ఇటీవల నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి టీడీపీ అధిష్టానం సముచిత స్థానం కల్పించిన విషయం తెలిసిందే. మహానాడు ముగిసిన మూడు రోజుల్లోనే ప్రభుత్వం ఆయనకు గన్‌మెన్‌లను కేటాయించడంపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి వర్గీయుల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ప్రవీణ్‌కు పార్టీలో ప్రాధాన్యం పెరుగుతోందా అని టీడీపీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం



సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న వెంకట నాగిరెడ్డి

ప్రొద్దుటూరు : రైతుల సంక్షేమమే లక్ష్యమని ఏపీ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ సీడ్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల వెంకటనాగిరెడ్డి తెలిపారు. స్థానిక కేసీపీ ఫంక్షన్ హాల్‌లో ఆ సంఘం ఉమ్మడి కడప జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఉమ్మడి కడప జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎం.మల్లికార్జునరావు, జిల్లా అధ్యక్షుడిగా ఎం.మధుసూదన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ట్రెజరర్‌గా బి.గంగాధర్, ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, సుధాకర్, సెక్రటరీలుగా ఈశ్వర్‌రెడ్డి, శివరాజు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల వెంకట నాగిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.


థియాంగో సంస్మరణ సభ



మాట్లాడుతున్న వరలక్ష్మి

ప్రొద్దుటూరు కల్చరల్ : అణగారిన ప్రజల తరపున మాట్లాడిన రచయిత గుగీవా థియాంగో అని విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి తెలిపారు. స్థానిక జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీగుప్త అధ్యక్షతన థియాంగో సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ సమాజంలోని అసమానతలపై గుగీవా థియాంగో తన రచనల ద్వారా పోరాడారని, మనుషులందరూ సమానమేనని తెలిపారన్నారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ గుగీవా ఆఫ్రికన్ సాహిత్యంలో చెరగని ముద్ర వేశారని, ఆయన రాసిన పుస్తకాలలో మాటిగరి, బందీ, మట్టి కాళ్ల మహారాక్షసి, యుద్ధకాలంలో స్వప్నాలు, ఏడవకు బిడ్డా అనేవి తెలుగులోకి అనువాదం అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మ, వేంపల్లి రాజశేఖర్, గురు, సారథి, సోయబ్, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆహార భద్రత



సోమిరెడ్డిపల్లె కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

మైదుకూరు : చిరుధాన్యాలతో ఆహార భద్రత ఏర్పడుతుందని జాతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలను ఆదివారం బ్రహ్మంగారిమఠం మండలంలో నిర్వహించారు. మల్లేపల్లె, సోమిరెడ్డి పల్లె, పలుగురాళ్లపల్లె గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో చిరుధాన్యాల పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ ఉమాకాంత్ మాట్లాడుతూ చిరుధాన్యాల్లోని రకాల లక్షణాలు యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత జోడింపు గురించి వివరించారు. కార్యక్రమంలో వనిపెంట కేవీకే పంటల సాగుపై ప్రచురించిన కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. శ్రీనివాసులరెడ్డి, ప్రవీణ్, సర్పంచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.